

# అమ్మకడుపు చల్లగా...

## – గొల్లపూడి మారుతీరావు



### (గత సంచిక తరువాయి)

**విజయవాడ కేంద్రంలో** ఉన్న అతిరథులలో నన్ను అభిమానించి, అల్లంత దూరంనుంచే నా అభివృద్ధిని గమనిస్తూ, నన్ను ఆశీర్వదించిన పెద్దలు కందుకూరి రామభద్రరావుగారు. ఆయన నిండు కుండ. గంభీరమయిన చిరుదరహాసం, ముక్తసరయిన పలకరింత. ఏనాడూ అనవసరమైన, వృథా ప్రసంగానికి తావివ్వని సరళత్వం – అదీ రామభద్రరావుగారు. ఆయన కవిత కూడా ఆయనలాగే గంభీరంగా, పెద్దరికంగా, హృద్యంగా, సరళంగా సాగుతుంది. ఆయన కేవలం కవే కాదు, మంచి సాహితీ పోషకులు. ఏనాడూ 'ఫోకస్' కోసం  తాపత్రయపడడమో, ప్రోగ్రాం మీటింగులలో విరుచుకుపడడమో లేనేలేదు. మంచి కార్యక్రమాన్ని చేస్తే – నెమ్మదిగా – నాకే తెలిసేటట్టుగా మాత్రమే తన ప్రశంసని అందజేసేవారు. అది గంభీరమయిన కితాబు నాలాంటివాళ్ళకి. ముఖ్యంగా నాకు ప్రత్యేకమయిన స్ఫూర్తినిచ్చేది. ఆయన దేశభక్తి, సమాజ అభ్యుదయ కాంక్ష – ఇవన్నీ సరేసరి. లలిత సంగీత కార్యక్రమాలలో అవి గుబాళించేవి.

రామభద్రరావుగారి కుటుంబానికి మా ఆవిడ చాలా సన్నిహితురాలు. మా పిల్లల కోసం మాంటిస్సోరి స్కూలుకి వెళ్ళి, బడి వదిలేవరకూ వారింట్లో కూర్చునేది. వారి శ్రీమతికి మా ఆవిడంటే అభిమానం. ఇక ఆ కుటుంబంతో నాకు మూడుతరాల సాన్నిహిత్యం. కందుకూరి వారితో రేడియో ఉద్యోగం, శశాంక గారితో సాహితీ పరిచయం, దరిమలాను వారబ్బాయి ఓలేటి పార్వతీశంతో రేడియో ఉద్యోగమ్.  అభిరుచి, సంస్కారం, విద్వత్తు కలబోసిన కుటుంబాలవి.

రామభద్రరావుగారి మాట మీదనే అమలాపురం కాలేజి వార్షికోత్సవాలకి వారబ్బాయి పుండరీకాక్షుడుగారు తీసుకెళ్ళగా వెళ్ళాను.

కందుకూరి రామభద్రరావుగారితో నా సాన్నిహిత్యానికీ, వారికి నా పట్ల గల అవ్యాజానురాగాలకీ రెండు గొప్ప నిదర్శనాలు – వారు నాకు రాసిన రెండే రెండు ఉత్తరాలు. రెండు సందర్భాలూ నేను ఉహించినవి కావు – ముఖ్యంగా కందుకూరి వారి వంటి విద్యావేత్త నుంచి.

1969 సెప్టెంబరు 30 న ప్రయోగ, కందుకూరి, గుమ్మలూరి సత్యనారాయణగారు – పదవీ విరమణ చేశారు రేడియో స్టేషన్ నుంచి. ఆ తర్వాత రామభద్రరావుగారు అమలాపురంలో వారబ్బాయిగారి దగ్గరకు వెళ్ళిపోయారు.

1970 సెప్టెంబరులో విజయవాడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆంధ్ర నాటక కళాపరిషత్ నాటకోత్సవాలు జరిగాయి. అది నాటకరచయితగా నా జీవితంలో మకుటాయమానంగా చెప్పుకోదగిన సందర్భం. పరిషత్ చరిత్రలో మొట్టమొదటిసారిగా అటు నాటకాలకీ, ఇటు నాటికలకీ నా రచనలు – కరుణించని దేవతలు, కళ్ళు – ఉత్తమ రచన బహుమతులందుకున్నాయి. సెప్టెంబరు 9న బహుమతి ప్రదానోత్సవం జరిగింది.

సెప్టెంబరు 16న కందుకూరి రామభద్రరావుగారు ఉత్తరం రాశారు. ఆ ఉత్తరాన్ని ఇంగ్లీషులోనే ఇక్కడ ఉటంకిస్తున్నాను.

"Believe me, I felt so glad that, mentally I was transferred to Vijayawada for a couple of minutes. I know this is not the be – all and end – all of your achievements. As Time advances and life deepens, your special talent of writing intellectual plays carries you into higher and much greater recognition. The late Amancharla Gopalarao used to discuss your plays with enthusiasm and admiration."

ఎంత గొప్ప ఆశీర్వాదం! వాక్శుద్ధి గల ఓ సాహితి స్రష్ట నోట పలికిన భవిష్యత్ వాణి అది.

జీవితం మరో ఆరు సంవత్సరాలు సాగింది. సినీరంగంలో మరిన్ని సోపానాలు ఎక్కే అవకాశం లభించింది. విశ్రామమెరుగని పరుగు. ఒకే దూకుడు. ఒకే లక్ష్యం వైపు దృష్టి సారింపు. సాహితీ జీవితం గంభీరమైన రచనా వ్యాసంగం నుంచి మామూలు సామాజికుడిని అలరించే పాపులర్ మీడియం వైపు మొగ్గు చూపింది. అది కోరి చేసిన ప్రయాణం కాదు. సినిమా తనకు తానే నా వేపు దూసుకు వచ్చిన ప్రభంజనం.

ఆ సమయంలో అనుకోకుండా రామభద్రరావు గారి నుంచి రెండో ఉత్తరం వచ్చింది. అది నాకు కాస్త ఆశ్చర్యమూ, ప్రత్యేకమైన ఆనందం కలిగించిన విషయం. కారణం – ఓ నాటక రచయితని అభినందించడం మొదటి ఉత్తరం ఉద్దేశమైతే – ఈ మీడియంతో ఏ మాత్రమూ సంబంధం లేని రామభద్రరావుగారిలాంటి సాహితీపరులు నా సినిమా వ్యాసంగాన్ని అభినందిస్తూ ఉత్తరం వ్రాయడం.

తేది. 28 –8–76. విషయం ఈ మధ్య మీరు మాటలు వ్రాసిన కొన్ని సినిమాలు చూశాను. అవి చాలా రక్తిగా ఉన్నాయి. సంభాషణలు నడపడంలో, ఊహాపోహలలో, ఉక్తివైచిత్రిలో ప్రతిభావంతమైన మీ ప్రత్యేకత స్పష్టంగా

కనిపిస్తుంది. మానవ స్వభావాన్ని మెరిపిస్తూ, రక్తిని ఉన్నత స్థాయిలో చిత్రమంతా నిలబెడుతుంది. ఇందుమూలంగా మీరు సంఘానికి ఎనలేని సేవ చేస్తున్నారని, ముందు ముందు ఇతోధికంగా చేస్తూ చాలా ప్రతిష్టనార్జిస్తారని విశ్వసిస్తున్నాను.

ఇది నా సినీ రచన మీద నాకందిన అతి గొప్ప ప్రశంసగా భావిస్తాను. ఇప్పటి సినీ రచయితలూ, దర్శకులూ - అంతా - ఈ వాక్యాలు గుర్తుంచుకోవాలంటాను. 'ఆ సంభాషణలూ - రక్తిని ఉన్నతస్థాయిలో చిత్రమంతా నిలబెడుతుంది' అన్నది.

రక్తి కోసం నానా దేబిరింపులూ, కేవలం నేలబారు స్థాయిలో సాహిత్యాన్నీ, నటననీ దిగజార్చే అవసరం రావచ్చని ఊహించని తరుణంలో - నిన్నటి తరం పెద్దమనిషి వ్రాసిన ఈ సమీక్ష అందరికీ కనువిప్పుగా నాకు అపురూపమయిన కితాబుగా భావిస్తాను.

సరిగ్గా నలభై రోజుల తర్వాత రామభద్రరావుగారు కన్ను మూశారు. ఈ ఉత్తరం నా హితైషి ఆఖరి ఆశీర్వాదంగా భావిస్తాను నేను.

2004 సంవత్సరంలో ఫోన్ చేసి వోలేటి పార్వతీశం ఒక కోరికని కోరాడు. మా తాతగారి జన్మదినం సందర్భంగా సన్మానానికి రావాలని. కందుకూరి వారి పెద్దబ్బాయి పుండరీకాక్షుడు, ఆఖరి కొడుకు నటరాజు వోలేటి, నేనూ శలాక రఘునాధశర్మగారూ గొట్టుముక్కలపల్లిలో వేద పండితుల్ని దర్శించి కందుకూరి వారి స్వగ్రామం రాజవరం వెళ్ళాం. రామభద్రరావుగారు వ్యవస్థాపక ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసిన ఆత్రేయపురం పాఠశాలలో వారి జయంతి సభ జరిగినప్పుడు ఒళ్ళు పులకరించింది. పాఠం చెప్పిన ఉపాధ్యాయుడిని - ఇన్ని సంవత్సరాలు పూజించే తరం ఉన్నంతవరకూ - ఈ సమాజం ఆరోగ్యానికి ఏమీ భంగం లేదు. నాకు బట్టలుపెట్టి సత్కరించిన సభలో ఆ మాటే చెప్పాను.

మనస్సులో మధురంగా నిలిచిన జ్ఞాపకాలు అనకాపల్లిలో సాహితి సభలు, కన్యకాపరమేశ్వరీ సత్రంలో భోజనాలు, సాయంత్రం కవితాగోష్టి.

తల్లావఝ్ఝుల శివశంకర స్వామిగారికి నన్ను పరిచయం చేస్తే "మీరు 'మారుతీ' రావని ఎందుకంటారు?" అని నవ్వారు. భాష తెలిసిన వారు ఇప్పటికీ మారుతిరావనే రాస్తారు. అయితే నాకు మొదటినుంచీ మారుతీరావనే అలవాటైపోయింది. పేరులోనే వ్యాకరణ దోషం.

ఆ సభలో ఇంకా గంటి శ్రీరామమూర్తి, ఓరుగంటి రామచంద్రయ్య, మొక్కపాటి సుబ్బారాయుడు (మొక్కపాటి నరసింహశాస్త్రిగారి అబ్బాయి), అంగర వెంకట కృష్ణారావు, అంగర సూర్యారావు, జయంతి సుబ్బారావు ('కవిగారు' అని

అందరూ పేర్కొనే మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి జీవితం – 'కవిగారి మనుగడ  అనే పుస్తకం రచించారు), బలివాడ కాంతారావు పాల్గొన్నారు. ఇందరి మహానుభావుల సాంగత్యంలో ఎవరయినా కవిత్వం చెప్పగలరు.

అప్పటి నా ప్రాచుర్యానికి సాక్ష్యం ఓ వింత అనుభవం ఉంది. అది విచిత్రమయినదీ, నేను మరువలేనిదీను.

ఆదిలాబాద్ దగ్గర ఓ బస్సులో ఒకాయన ప్రయాణం చేస్తున్నాడు. బస్సుకి ఆక్సిడెంటు అయింది. ఆయన పోయాడు. పోయిన వ్యక్తి కొడుకు పేరు సూర్యనారయణ – విజయవాడ రేడియో స్టేషన్‌లో ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నాడు. నా దగ్గరకి ఓ సహాయం కావాలంటూ వచ్చాడు.

తన తండ్రి మృతికి నష్టపరిహారం కోసం డిపార్టుమెంటు మీద కేసు పెట్టాడట. కేసు నడుస్తోంది. బస్సులోని ప్రయాణీకులు కోర్టుకి వచ్చి సాక్ష్యం చెప్పాలి. ఒక సాక్షికి ఈ సూర్యనారాయణ నాతో కలిసి పనిచేస్తున్నాడని తెలిసింది. నా పరిచయం కావాలన్నాడు. ఆయన నాకో ఉత్తరం రాస్తే – దానికి నేను సమాధానం రాయాలి. ఇదీ సహాయం. ఆనందంగా అంగీకరించాను.

మరో విచిత్రమయిన ఉత్తరం. దానికి నేను రాసిన  సమాధానం గుర్తుచేసుకోవాలి. పుస్తకం కోసం నాకు తను పంపిన రెండు రూపాయలను తిప్పి పంపమని కోపంగా నన్ను తిడుతూ అన్నవరం నుంచి 'రమణ' అనే ఆయన ఉత్తరం రాశాడు. న్యాయంగా ఉత్తరాన్ని బుట్టదాఖలా చేయవచ్చు. కాని ఎందుకనో, అతనికి పాఠం చెప్పడం మంచిదనిపించి సమాధానం రాశాను. అది ఇది:

"రమణగారూ, మీ ఉత్తరం ఇక్కడికి రీడైరెక్టు అయి వచ్చింది. మీ ఉత్తరంలో పొరపాట్లు చూడండి.

1) నేను గొల్లపల్లి మారుతిరావుని కాదు.

2) నేను 'భజంత్రీలు' అనే నాటిక వ్రాయలేదు.

3) నాకు మీ ఉత్తరం కాని, ఎం.ఓ కాని అందలేదు.

4) నేను మీకు వి.పి.పిలో భజంత్రీలు పంపలేదు. (పంపవలసిన అవసరం నాకు లేదు కనుక).

5) మీకు ముందు చేరిన వి.పి.పి ఎవరు పంపారో నాకు తెలీదు.

6) మీరు వ్రాశారని చెప్తున్న రెండు ఉత్తరాలూ నాకు చేరలేదు.

7) నాకు ఉత్తరం రాసిన అడ్రసు సరికాదు. (రీ డైరెక్టు అయి వచ్చింది).

రచన ఎవరు చేశారో, ఎవరికి ఉత్తరం రాశారో, ఎక్కడి నుంచి వి.పి.పి వచ్చిందో తెలియని పరిస్థితిలో, రెండు రూపాయలు పంపమని వ్రాసిన మీ ప్రతిభని ఏమని కొనియాడాలి. రచయితకి పంపిన 2 / (ఎవరైనా సరే) తిప్పి పంపమనే మీ ఔదార్యం నాటక రంగానికి వన్నె తెచ్చిపెట్టదు. చిన్నతనం కూడాను. ఇది మీకు తెలియచెప్పాలని 6 నయాపైసలు ఖర్చు చేశాను. ఎప్పుడయినా మీ రెండు రూపాయలు (ఆ దురదృష్టపు రచయిత నుంచి) అందడం జరిగితే నా ఆరుపైసలూ పంపడం మరిచిపోకండి."

దీని సమధానం నాకు ఆ 'రమణ'నుంచి రాలేదు! వస్తుందని నేనాశించనూ లేదు.

ఉద్యోగ నిర్వహణలో తృప్తినీ, పేరునీ తెచ్చిన సంఘటన ఒకటుంది. ఎప్పుడో నా చిన్నతనంలో ప్రధాని నెహ్రూగారు ఈ దేశంలో తయారయిన మొట్టమొదటి నౌక జల ఉషని హిందుస్థాన్ షిప్‌యార్డులో సాగర ప్రవేశం చేయిస్తున్నప్పుడు నగరంలో ఈవలి ఒడ్డునుంచి విస్మయంతో అబ్బురంగా చూశాను. అప్పుడు నా వయస్సు తొమ్మిది సంవత్సరాలు.

మరొక 15 ఏళ్ళ తర్వాత – విజయవాడ రేడియో తరఫున 1968 – 69 ప్రాంతంలో మరొక నౌక (పేరిప్పుడు గుర్తులేదు) సాగర ప్రవేశ కార్యక్రమానికి ప్రోగ్రాం రికార్డు చేయడానికి ఆఫీసరుగా వెళ్ళాను. నౌకని ముఖ్య అతిధి నామకరణం చేసి, దాని భవిష్యత్తుకి శుభాకాంక్షలు పలికి – సముద్రంలోకి విడుదల చేస్తారు. ఇంజన్లు అవీ ఏర్పరచకుండానే సిద్ధంగా ఉన్న నౌక జలప్రవేశం చేస్తుంది. ఇదీ కార్యక్రమం. ఆనాటి నౌకని అప్పటి నౌకా శాఖ కేంద్రమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిగారి చేతుల మీదుగా జలప్రవేశం చేస్తారు.

నౌక పెద్ద పెద్ద స్టాండుల మీద నిలిచి ఉంటుంది. కొన్ని వందల అడుగుల ఎత్తున్న  బృహత్తరమయిన నిర్మాణం అది. ఆ స్టాండులకు ఎలక్ట్రానిక్ వైర్లతో ఉచ్చులు బిగిస్తారు. నౌక సుళువుగా నీటిలోకి జారడానికి కొన్ని వందల టన్నుల గ్రీసు, అరిటిపళ్ళు వంటివి నౌక జారే పట్టాల మీద వేస్తారు. ఎలక్ట్రానిక్ ఉచ్చులు ఒక బటన్ దగ్గర సమీకృతమయి ఉంటాయి. ఆ బటన్ నొక్కగానే నౌకని పట్టుకు నిలిచిన ముడులన్నీ ఒక్కసారి పిగిలిపోతాయి. గ్రీసుమీద, అరటి పళ్ళ జిగురు మీదా పట్టాల ద్వారా నౌక సముద్రంలోకి జారిపోతుంది. నౌకలో కొంత సిబ్బంది ఉంటారు. నౌక చుట్టూ ఆహూతులయిన అతిథులూ, ముఖ్య అతిథీ, వందలాది షిప్‌యార్డు సిబ్బందీ ఉంటారు.

నౌకని విడుదల చేసే బటన్ దగ్గర ఒక వేదికని వేశారు. ఆ వేదికని ముఖ్య అతిథి ఎక్కి "ఈ నౌకకి ఫలానా పేరు పెడుతున్నాను. ఈ నౌకకు మంచి భవిష్యత్తుని కోరుకుంటున్నాను" వంటి మాటలు చెప్పి బటన్ నొక్కుతారు. నౌక కదులుతుంది. ఇదీ కార్యక్రమం.

నౌకకి కాస్త దూరంగా ముఖ్య అతిథి ఆహూతులనుద్దేశించి ప్రసంగిచండానికి మరొక వేదికని ఏర్పాటుచేశారు. చుట్టూ అతిథులు – పెద్ద షామియానా – పత్రికా విలేఖరులూ – హడావిడిగా ఉంది.

షిప్‌యార్డ్ ఛైర్మన్ ప్రసంగం అయింది. బ్రహ్మానందరెడ్డిగారు ఉపన్యాసం మొదలుపెట్టారు. రాజకీయ నాయకులు కనక చిలవలు పలవలుగా సాగుతోంది – తాపీగా. ఈలోగా నౌకని విడుదల చేసే వేదిక దగ్గర అలారం ప్రారంభమయింది. మా టేప్ రికార్డర్లు ఉపన్యాసాన్ని రికార్డు చేస్తున్నాయి. అలారం వింటూనే షిప్ యార్డ్ అధికారుల ముఖంలో కలవరం మొదలయింది. నాకు అర్థం కాలేదు. ఒక ఆఫీసరుని అడిగాను. ఈ అలారం నౌక విడుదల కోసం ఏర్పాటు చేసిన టైమింగ్. 8 మిమిషాల తర్వాత – బటన్ నొక్కకపోయినా – ఎలక్ట్రానిక్ ఉచ్చులు వాటంతటవే పిగిలిపోయి, నౌక సముద్రంలోకి వెళ్ళిపోతుంది – అన్నాడు. నాకూ కంగారు ప్రారంభమయింది. అయినా మా ఇంజనీరుతో చెప్పి – ముందు నౌక సముద్రంలోకి వెళ్ళిపోతుంది అన్నాడు. నాకూ కంగారు ప్రారంభమయింది. అయినా మా ఇంజనీరుతో చెప్పి – ముందు నౌక బయలుదేరే వేదిక దగ్గరకి రికార్డరుతో సహా పరిగెత్తమన్నాను. ఈలోగా ఎవరో బ్రహ్మానందరెడ్డిగారి చెవిలో ఈ విషయం చెప్పినట్టున్నారు. ఆయన ఉపన్యాసం ముగించి – పరుగున నౌక దగ్గరి వేదికని ఎక్కారు.

సరిగ్గా ఈ సమయంలో కరెంటు పోయింది. అందరి ముఖాలలో మరింత కంగారు. అలారం ఒక పక్క మ్రోగుతోంది. ఆఫీసర్లు వాచీలు చూసుకుంటున్నారు. బ్రహ్మానందరెడ్డిగారు నౌక దగ్గరకి వచ్చారు.

నా 'కళావని'ప్రాంభోత్సవం – మొదటి నందీ అవార్డు ఉపన్యాసం కారణంగా రెడ్డిగారికి నన్ను తెలుసు. నేనక్కడ ఎందుకున్నానో తెలియదు. అప్పుడు వారితో చెప్పాను. "అయ్యా కరెంటు పోయింది. నేను ఆలిండియా రేడియో తరఫున వచ్చాను. మా రికార్డర్లు బ్యాటరీతో నడుస్తున్నాయి. మీరు చెప్పే ప్రకటన ఈ మైకులో చెప్పండి" అని మైకు ముందు పెట్టాను. ఆయన చెప్పేశారు. "I Solemnly name this ship..."ప్రకటన పూర్తయి నౌక మీద కొబ్బరికాయ కొట్టి బటన్ మీద చెయ్యి పెట్టారో అసలు దాన్ని తాకారో లేదు – ఎలక్ట్రానిక్ ఉచ్చులు పిగిలిపోయాయి. షిప్పు మీద హాహాకారాలు – ఎల్లెడలా చప్పట్లు – నౌక పట్టాల మీద నుంచి జారడం ప్రారంభమయిపోయింది.

అప్పుడు మరొక విషయం జరిగింది. అన్ని వందల ఎత్తయిన నౌకా – రెండు క్షణాలు – కుడివేపు తూలి – మళ్ళీ పెద్ద శబ్దం చేస్తూ – ఎంట్రన్స్ (కం – ఎగ్జిట్)లోకి జారిపోయింది. వెనక్కి తిరిగితే షిప్‌యార్డు సిబ్బంది – ఎవరి ముఖాల్లోనూ రక్తపు చుక్కలేదు. తర్వాత తెలిసిన విషయం నౌకవి ఎడమ వేపు ఉచ్చులు వెంటనే పిగిలిపోయాయి. కుడివేపువి కొన్ని సెకండ్లు ఆలస్యమయాయి. తత్ఫలితంగా కొన్నివేల టన్నుల నౌక కుడివేపు కొన్ని క్షణాలు ఒరిగింది. పొరపాటు జరిగి అటు తూలితే? ఎన్ని వందల మంది చచ్చిపోయేవారు. ఎంత కల్లోలం! ఎన్ని కోట్ల ఆస్తినష్టం? నౌక

పక్కనే ఉన్నవారి సంగతేమిటి? వీటికి సమాధానాలు అనూహ్యం. తర్వాత డిపార్టుమెంటువారు పరిశీలనలు జరుపుకుని లాప్సెస్‌ని కవరు చేసుకున్నారు.

ఏమయినా ఆ మర్నాడు రాత్రి 9.15 నిముషాలకి – కాసు బ్రహ్మానందరెడ్డిగారి ప్రకటనతో మా రేడియో కార్యక్రమం ప్రసారమయింది – మరెక్కడా ఎవరూ ఆ ప్రకటనని విని ఉండరు – రేడియోలో తప్ప.

అదొక అనుభవం – మరిచిపోలేని జ్ఞాపకం.

మరిచిపోలేని మరో సంఘటన. ఓ సాయంకాలం దిగులుగా డ్యూటీ రూముకి వచ్చారు రాచకొండ నరసింహమూర్తిగారు. కొమ్మూరి ఫోన్ నెంబరు అడిగారు. ఆయన ఆఖరి పిల్ల – నెలల పిల్ల బాగోలేదట. ప్రాణాపాయ స్థితిలో ఉంది. వెంటనే ఆసుపత్రిలో చేర్చాలన్నారు కొమ్మూరి. అమెరికన్ హాస్పిటల్‌లో చేర్చారు. డ్యూటీ అవగానే వెళ్ళాను. నన్ను చూడగానే "మీ గురించే అయిదు నిముషాల నుంచి అనుకుంటున్నాను" అన్నారు రాచకొండ అవసరం అర్థమయి వెంటనే ఇంటికి తీసుకొచ్చి 20 రూపాయలు చేతిలో పెట్టాను. ఇద్దరం వెళ్ళి తల్లికి భోజనం ఇచ్చి వచ్చాం. "నాకేం నమ్మకంలేదు – తెల్లారేవరకూ బతుకుతుందని" అంటూ ఇంటికి వెళ్ళారు రాచకొండ. నాకెందుకో బ్రతుకుతుందని నమ్మకం.

మర్నాడు ఉదయమే రాచకొండ నన్ను తట్టిలేపారు. రాత్రే అమ్మాయి సీరియస్‌గా ఉంది. లాభం లేదని డాక్టర్లు చెప్పేశారు. ఎందుకో డీలా పడ్డాను. ఇప్పుడు ఆసుపత్రికి వెళ్ళేముందు మీరు నా పక్కన ఉంటారని వచ్చాను" అన్నారు. వెంటనే బట్టలేసుకుని ఆయనతో బయలుదేరాను. ఇద్దరం ఆసుపత్రికి వచ్చాం. నర్సు మమ్మల్ని చూసి "రాత్రే అమ్మాయి పోయింది. శవం మాకక్కరలేదని తల్లి అప్పగించేసి వెళ్ళిపోయారు" అని చెప్పేసరికి కొయ్యబారిపోయాం. ఇంటివేపు తొందరగా నడవబోయేసరికి ఆవిడా, ఏడిద కామేశ్వరరావుగారి (ఆయన చిన్నపిల్లల కార్యక్రమం నిర్వహించేవారు) భార్యా కనిపించారు. ఆయన దగ్గర డబ్బు లేదు. మరో పది ఇచ్చాను. ఇద్దరం స్థిమిత పడ్డాక "అమ్మాయిని నేనే పారేస్తే నాకు తృప్తిగా ఉంటుంది" అన్నారు నాతో. అయితే అలాగే చెయ్యండి అన్నాను. కాని మనుషుల్లేరు. అందరు స్నేహితుల్నీ ప్రయత్నించాం. ఎవరూ కనిపించలేదు. తల్లిదండ్రులుండగా నేను శ్మశాన వాటికకి వెళ్ళడం సంప్రదాయం కాదు. చివరికి విసిగి ఆయనే అన్నారు – "నేనే అంతా చేసుకు వస్తాను. మీరు కృష్ణానది వరకూ నాతో రండి చాలు" అని. సరే అన్నాను. రిక్షాలో ఆయనా బిడ్డా, వెనుక నా విక్కీ మోపెడ్ మీద నేనూ. నది గట్టున నిలబడ్డాను. ఒక అరగంటకి కళ్ళు తుడుచుకుంటూ వచ్చారు.

వస్తూ చెప్పారు. "శరీరం మంచుముద్దలగా ఉంది. ఎంత చక్కని ముక్కనుకున్నారు అమ్మాయిది. చేతుల్లో ఉంటే మమత వల్ల చేతుల నరాలు కొట్టుకున్నాయి. ఆమె తల దగ్గర నరం కదిలేసరికి ఆమె తలలో నరంకదులుతుందా అని వో క్షణం మనస్సు పీకింది. వెధవ మనమత" అని నవ్వారు.

పసిబిడ్డ పోయిన తండ్రి ఆర్తిని ప్రత్యక్షంగా పంచుకోవడం జీవితంలో అదే మొదటిసారి. పరోక్షంగా పంచుకోవడం గణేష్ పాత్రో కూతురు పోయినప్పుడు. ఈ నాలుగు వాక్యాలూ రాశాడు. "మా పాప కళ్ళు మూసుకుంది. ఏడువారాల జీవితపర్యంతం ఒక్క క్షణం రిత్తపోనీయక కనిపించిన ప్రతీ వాళ్ళనీ తినేసే, తాగేసే చూపులు చూసి, చూసిన వాళ్ళందరినీ మురిపిస్తూంటే, నా తండ్రి హృదయం రోసి "తప్పమ్మా! దిష్టి తగులుతుంది. కళ్ళు మూసుకో" అన్నాను. నా మాట మీద పిచ్చుముండకెంత గురో!"

దుఃఖాన్ని వెళ్ళగక్కడానికి ఒక్కొక్కరికి ఒక్కో ఊతం కావాలి. రాచకొండకి స్పందించే స్నేహితుడు, పాత్రోకి స్పందనని పంచుకునే హితుడు. నిజమైన దుఃఖాన్ని నిజాయితీగా చెపితే అది కవిత్వం అవుతుంది అనడానికి అటు రాచకొండ, ఇటు పాత్రో – సాక్షులు.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments